ధీమాగా ఉంటే బీమా రాదు..!

- రైతులు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలి
- సెప్టెంబర్ వరకూ గడువు
- గ్రామాల్లో ప్రచారం చేస్తున్న అధికారులు


పిఠాపురం మండలంలో ఈ–క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

పిఠాపురం: రైతుల పరిభాషలో చెప్పాలంటే 'పాయ్యకాడ ఆకుమడిలా' అన్ని వసతులు వారి కాళ్ల దగ్గరకే తెచ్చి పెడుతోంది ఈ–క్రాఫ్ నమోదు. ఈఏడాది ఈ–క్రాప్ నమోదు ప్రారంభమవ్వడంతో రైతులను సమాయత్తం చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. అన్నం పెట్టే రైతన్నకు ఆసరా కల్పించాలన్న ధ్యేయంతో పంటల బీమా కోసం ఈ–క్రాప్ నమోదు చేపట్టారు అధికారులు. ఆ దిశగా క్షేత్ర స్థాయిలో అడుగులు పడుతున్నాయి. ఈ–క్రాప్ నమోదు ప్రక్రియతో వ్యవసాయ అనుబంధ శాఖ సేవలన్నీ రైతుకు ఏ ఇబ్బంది లేకుండా అందేలా చర్యలు తీసుకుంటున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 25 శాతం మాత్రమే నమోదు పూర్తవ్వడంతో దానిని మరింత వేగవంతం చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఈ–క్రాప్‌పై విస్తృత ప్రచారం

రైతు సేవా కేంద్రంలో ఈ–క్రాప్ నమోదు చేయించుకున్న రైతుకు సంబంధించిన పంటలు ప్రకృతి వైపరిత్యాల వల్ల నష్టం జరిగితే వెంటనే నష్టపరిహారం అందెలా చర్యలు తీసుకోడానికి ఈ–క్రాప్ నమోదు దోహదపడుతుంది. ప్రీమియం చెల్లింపు విషయంలో ప్రభుత్వం ఇంకా క్లారిటీ ఇవ్వకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పొలంబడి కార్యక్రమంలోను వ్యవసాయ శాఖాధికారులు ఈ–క్రాప్‌పై రైతుల్లో అవగాహన కల్పిస్తున్నారు. నియోజకవర్గంలో ఏ రైతు ఇతర గ్రామాలు వెళ్లనక్కరలేదని, తమ గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లి బయోమెట్రిక్ వేయించకుంటే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. రైతులందరూ తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని అధికారులు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పొలాల్లోకి వెళ్లి మరీ వివరిస్తున్నారు.

నియోజకవర్గంలో రైతులు

మండలం	రైతులు
గొల్లప్రోలు	10452
కొత్తపల్లి	8168
పిఠాపురం పట్టణం, మండలం	17323
సాగవుతున్న భూములు	43 వేల ఎకరాలు

ఈ–క్రాప్ నమోదు ప్రారంభించాం

అన్ని మండలాల్లోను ఈ–క్రాప్ నమోదు ప్రారంభించాం. సెప్టెంబర్ వరకూ గడువు ఉంది. అందరూ తమ పొలాలు, పంటల వివరాలు చెప్పి రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలి. ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, సీసీఆర్డీ కార్డు తీసుకుని వెళ్లి నమోదు చేయించుకోవాలి. ఇప్పటికే వ్యవసాయ శాఖ సిబ్బంది ఆయా గ్రామాల పరిధిలో ఈ–క్రాప్ నమోదుపై రైతులకు సమాచారం ఇచ్చి అందరిని సిద్ధం చేస్తున్నారు. ఈ–క్రాప్ నమోదు చేయించుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. పంటల బీమా రావాలంటే అందరూ తప్పనిసరిగా చేయించాకోవాలి. వరితో పాటు మొక్కజొన్న, ప్రత్తి, మల్బరీ, అపరాలు, మామిడి, జీడిమామిడి ఇలా ఏపంటలైనా సరే ఈ–క్రాప్ చేయించుకోవాల్సిందే.

– ఎ.అచ్యుతరావు, వ్యవసాయ శాఖాధికారి, పిఠాపురం

అపర్ణాదేవికి శ్రావణమాస పూజలు


ప్రత్యేక అలంకరణలో అపర్ణాదేవి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసి ఉన్న అపర్ణాదేవికి మంగళవారం ఆలయ అర్చకులు శ్రావణమాస పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. శ్రావణ మాసం రెండో మంగళవారం సందర్భంగా అమ్మవారికి బత్తాయి పండ్లతో ప్రత్యేక అలంకరణ చేయగా పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

క్లుప్తంగా

సంపద కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం


వాకతిప్పలో చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద శిక్షణ ఇస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం చేకురుతుందని ఈఓపీఆర్డీ భాస్కరరావు అన్నారు. వాకతిప్పలోని చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద మంగళవారం ఎరువు తయారీపై సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, వీధిలైట్ల నిర్వహణ, పంచాయతీ పాలన తీరు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపడాలి


పవర గ్రామంలో విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: విద్యార్థుల నైపుణ్యాలు మరింత మెరుగుపడాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. మండల పరిధిలో పవర గ్రామంలో ప్రాథమిక పాఠశాలలను ఆయన పరిశీలించారు. ప్రతి విద్యార్థి చదడం, రాయడంపై శ్రద్ధ చూపాలని ఆయన అన్నారు. విద్యార్థుల పుస్తకాలను పరిశీలించారు. సిలబస్‌ను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లీషులోని అంశాలను క్షుణంగా చదివేలా చూడాలన్నారు. ఈ నెల చివరిలో జరిగే పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని తెలిపారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి 100 శాతం విద్యార్థులు భోజనం చేసేలా చూడాలన్నారు. గ్రామంలోని హైస్కూల్‌లో విద్యా బోధనను ఆయన పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు గోపి, విజయకుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు బాలురపై దాడి


దయను 108లో కాకినాడకు తీసుకువెళ్తున్న కుటుంబ సభ్యులు

సామర్లకోట: స్థానిక కిర్లంపూడి రోడ్డులోని జగనన్న కాలనీ వద్ద ఇద్దరు మైనర్ బాలురపై కొంత మంది దాడి చేసి గాయపర్చిన సంఘటన ఇది. ఆ ప్రాంతంలో బాలికలపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణల మేరకు యువకులపై దాడి చేశారు. ఈ దాడిలో దడాల దయ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా సిబ్బంది వైద్యం చేయడానికి నిరాకరించడంతో దయ బంధువులు ఆందోళనకు దిగారు. దీంతో వారు వైద్యం ప్రారంభించారు. ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

వాహనం ఢీకొని దేవాలయం గోడ ధ్వంసం

కాకినాడ క్రైం: డ్రైవర్ అజాగ్రత్త వల్ల ఓ వాహనం దేవాలయాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో గుడి గోడ భాగం ధ్వంసమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, సోమవారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోర్ వీలర్ వాహనాన్ని నడుపుతూ కాకినాడలోని రామారావుపేటలో సుబ్బయ్య హోటల్ సమీపంలో ఉన్న వినాయకుడి గుడిని ఢీకొట్టి పరారయ్యాడు. మంగళవారం ఉదయాన్నే స్థానికులు గమనించారు. వారిలో ఒకరైన పూసర్ల సత్యనారాయణ ఘటనపై కాకినాడ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సీఐ నాయక్ ఆధ్వర్యంలో విచారణ జరిపారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దేవాలయాన్ని ఢీకొట్టింది ఏపి 39 యూసీ 2771 నంబరుగల టాటా మేజిక్ వాహనంగా గుర్తించారు. ప్రమాదానికి కారణమైన చోదకుడు కాకినాడకు చెందిన విజయదుర్గాప్రసాద్‌గా నిర్ధారించారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారణ ప్రారంభించారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

బోట్‌క్లబ్: స్థానిక టౌన్‌హాల్ కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కమిటీ కార్యదర్శి పాబోలు చిన్నపున్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నామని, సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భారతీయ న్యాయ సంహిత క్రిమినల్ చట్టాలపై అవగాహన


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పిఠాపురం: ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం మహిళలు, బాలల చట్టాల గురించి భారతీయ న్యాయ సంహిత క్రిమినల్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పిఠాపురం ఐసీడీఎస్ అధికారిని సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి సూచించారు. పిఠాపురం అంబేడ్కర్ గురుకుల వసతి గృహంలో మంగళవారం వంద రోజుల మిషన్ శక్తి అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం, మహిళలు బాలల చట్టాల గురించి భారతీయ న్యాయ సంహిత క్రిమినల్ చట్టాల కోసం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతన చట్టాలు వాటి వల్ల కలిగే ప్రయోజనాలు వాటిని ఎలా ఉపయోగించుకోవాలి తదితర అంశాలను వివరించారు. చట్టం అమలు కోసం అంతర్గత కమిటీల ఏర్పాటు, ఎవరు సభ్యులుగా ఉంటారు అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పని ప్రదేశాలలో లైంగిక వేధింపులకు అయితే విధమైన చట్టాలు ఉన్నాయి. ఈ కార్యక్రమం ఐసీడీఎస్ సిబ్బంది పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సూపర్‌వైజర్లు, మహిళా శక్తి సభ్యులు ఆశా వర్కర్లు ఏఎన్ఎంలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో వర్మీ కంపోస్టు యూనిట్


శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్యామ్‌సుందర్

సామర్లకోట: ప్రజలకు ఆరోగ్యవంతమైన పంటలు లభించేలా ప్రతి గ్రామంలో వర్మీ కంపోస్టు యూనిట్లు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ ఎన్‌డీ శ్యామ్‌సుందర్ అన్నారు. మండల పరిధిలోని సర్పంచ్, పంచాయతీ గ్రేడ్–1, గ్రేడ్–5 కార్యదర్శులకు శిక్షణలో భాగంగా రెండో రోజు మంగళవారం ఉండూరులో ఫీల్డు విజిట్ నిర్వహించారు. అక్కడి వర్మీ కంపోస్టు యూనిట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సేంద్రియ వ్యవసాయంపై ప్రాధాన్యం పెరుగుతోందని చెప్పారు. ఈ మేరకు వర్మీ కంపోస్టుకు మంచి డిమాండ్ ఉంటుందని చెప్పారు. ఉండూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌కు జాతీయ స్థాయిలో అవార్డు వచ్చిందని, ఈ యూనిట్లలో తయారు చేసిన వర్మీ కంపోస్టును ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. దాంతో పంచాయతీలకు ఆదాయం వస్తుందని చెప్పారు. ప్రజలు, రైతుల్లో వర్మీ కంపోస్టుపై అవగాహన పెంచడానికి పంచాయతీ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాల్లో పండ్ల మొక్కలు వేసి వాటిని వర్మీ కంపోస్టుతో పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా వర్మీ కంపోస్టు తయారీపై పంచాయతీల సర్పంచ్, కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఎంఓటీలు వై.శ్రీహరి, ఫణికుమార్, సర్పంచ్ సత్యాడి దన లక్ష్మి పాల్గొన్నారు. డీఎల్‌పీడీ అణామణి శిక్షణను పరిశీలించారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా


పిఠాపురంలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు


పిఠాపురంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

పిఠాపురం: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ కళాశాల విద్యార్థులు మంగళవారం పిఠాపురం ప్రధాన రహదారులలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో 200 మంది విద్యార్థులు, అధ్యాపక అధ్యాప కేతర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ ర్యాలీ కళాశాల నుంచి అంబేడ్కర్ విగ్రహం మీదుగా ఉప్పాడ బస్టాండ్ వరకూ కొనసాగింది. స్థానిక ఉప్పాడ బస్టాండ్ వద్ద విద్యార్థులు అధ్యాపక సిబ్బంది కలసి మానవహారాన్ని ఏర్పాటు చేశారు. నూతన కాలేజీ భవనంపై కూడా జాతీయ జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిని మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తి బోధనలను పెంపొందించుకొని ఉత్తమ పౌరులుగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఉషశ్రీ, ఎన్.ఎస్.ఎస్.కో ఆర్డినేటర్ యూవీబీబీ కృష్ణప్రసాద్, కె.ఆనంద్, సీహెచ్ పద్మావతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ..

బీజేపీ ఆధ్వర్యంలో పిఠాపురం పట్టణం నుంచి గొల్లప్రోలు వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ఇన్‌చార్జి గుండ్రా అరుణ్‌కుమార్, ముఖ్యఅతిథిగా కాకినాడ జిల్లా పార్లమెంట్ కన్వీనర్ రంభాల వెంకటేశ్వరరావు, పెండెం సత్యనారాయణ, కన్వీనర్ బుర్రా కృష్ణంరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకట సూర్యనారాయణ రాజులు హాజరయ్యారు. గండి కొండలరావు, కో కన్వీనర్ వాసంశెట్టి శ్రీనివాస్, పిఠాపురం పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, టౌన్ ఇన్‌చార్జి అల్లుబోయిన సూరిబాబు, సీనియర్ నాయకులు తోట ఏడుకొండలు, స్టేట్ స్వచ్ఛభారత్ కో కన్వీనర్ బుర్రి మురళీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.


గొల్లప్రోలులో జాతీయ నాయకుల విగ్రహాల వద్ద బీజేపీ నేతలు

గొల్లప్రోలులో ..

బీజేపీ గొల్లప్రోలు పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు ఆధ్వర్యంలో హర్ గర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న జాతీయ మహనీయులు, దేశ నాయకులు విగ్రహాలను శుభ్రం చేసారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఉలవశెట్టి శ్రీను, కర్రి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు మేడసాని కామరాజు, ఓబీసీ చీపూరి భాస్కరరావు, నాయకులు పాల్గొన్నారు.



ఉప్పాడలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పాఠశాలలో ..

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ బాలురు, బాలికల పాఠశాలలో హర్ గర్ తిరంగా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్సెస్ అండ ట్రైనింగు న్యూఢిల్లీ రీసోర్స్ పర్సన్ సకరసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాల నుంచి ఉప్పాడ సెంటర్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ చేశారు. ప్రధానోపాధ్యాయులు రమణమూర్తి, అన్నపూర్ణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువుల డీలర్లు అప్రమత్తంగా ఉండాలి

ఏడీఏ రత్నప్రశాంతి


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రత్న ప్రశాంతి

సామర్లకోట: ఎరువుల డీలర్లు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఎం.రత్నప్రశాంతి అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన ఎరువులు, పురుగు మందుల డీలర్ల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీలర్ల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. స్థానికంగా సమస్యలు పరిష్కారం కాకపోతే పైస్థాయి అధికారులకు వివరిస్తానని ఆమె తెలిపారు. ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన డీలర్లు ఏ రోజు విక్రయాలు ఆరోజు పుస్తకాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఎరువులు, పురుగు మందుల వ్యాపారాలకు సంబంధించి అనేక మార్పులు వచ్చాయన్నారు. ప్రస్తుత వ్యాపారంలో యాప్‌లు ఉండటం వలన జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ మేరకు నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఏఓ సత్య మాట్లాడుతూ ప్రతి డీలర్ వద్ద లైసెన్సుతో పాటు లైసెన్సుకు చేసిన దరఖాస్తు ఉండాలన్నారు. ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన అర్హత తప్పనిసరిగా ఉండాలన్నారు. బిల్ పుస్తకాలు నిర్దేశించిన ఫార్మేట్‌లోనే ఉండాలన్నారు. నిల్వ రిజిస్టర్లలో రికార్డులు సక్రమంగా ఉండాలని సూచించారు. కంపెనీల వారిగా స్టాక్ రిజిస్టర్‌లు ఉండాలన్నారు. కంప్యూటర్ బిల్లులతో పాటు మాన్యువల్ బిల్లులు ఉండాలన్నారు. ప్రతి రైతుకు బిల్లులు ఇవ్వాలన్నారు. రైతులను ఇబ్బంది పెడితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బేయర్ పురుగు మందుల కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వ్యవసాయ క్షేత్ర ఏఓ జె.పుణ్యవతి, ఎరువుల డీలర్ల మండల అధ్యక్షుడు ఎం వెంకట్రావు, కార్యదర్శి నాగబాబు, ఉపాధ్యక్షుడు భద్రరావు, డీలర్లు పాల్గొన్నారు.

నిగ్రహంతో భవిత బంగారం

- చీకటి తప్పులతో జీవితం అంధకారం
- హెచ్‌ఐవీతో అప్రమత్తంగా ఉండాలి
- 'మీకు తెలుసా' కార్యక్రమంలో చేంజెస్ ప్రోగ్రాం మేనేజర్ దుర్గా భవాని


సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రోగ్రాం మేనేజర్ దుర్గాభవాని

కాకినాడ క్రైం: క్షణికావేశంలో చేసే చీకటి తప్పుల వల్ల ఎన్నో జీవితాలు అంధకారం అవుతున్నాయని ప్రభుత్వ అనుబంధ సంస్థ చేంజెస్ ప్రోగ్రాం మేనేజర్ దుర్గా భవాని అన్నారు. హెచ్‌ఐవీ బాధితులు, ట్రాన్స్‌జెండర్లు, పడుపు వృత్తిలో మగ్గిపోతున్న మహిళల సంరక్షణ కోసం పనిచేస్తున్న ఈ సంస్థ మంగళవారం కాకినాడలోని రాజీవ్‌గాంధీ ఎంబీఏ కళాశాలలో హెచ్‌ఐవీపై యువతలో అవగాహన కల్పించేందుకు 'మీకు తెలుసా' పేరుతో సదస్సును నిర్వహించింది. జిల్లాలో ఎయిడ్స్ కేసులు గణనీయంగా తగ్గాయని, ఇదే ఒరవడి కొనసాగించి హెచ్‌ఐవీ రహిత జిల్లాగా కాకినాడను తీర్చిదిద్దాలని భవాని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ పుష్పకుమారి ఆధ్వర్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి, చేంజెస్ సంయుక్తంగా ఎందరో ట్రాన్స్‌జెండర్లు, సామాన్యులు, పడుపు వృత్తిలో కొనసాగుతూ హెచ్‌ఐవీ బారిన పడిన బాధితులకు అండగా నిలిచి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచామన్నారు. వీరందరికీ నిత్యం హెచ్‌ఐవీ పరీక్షలు జరిపి బాధితులకు సకాలంలో మందులు అందిస్తున్నామన్నారు. విద్యార్థి దశలోనే నిగ్రహ శక్తిని అలవరుచుకోవడం ద్వారా భవిష్యత్ బంగారుమయం అవుతుందన్నారు. లైంగిక విజ్ఞానాన్ని ఓ శాస్త్రంగా పరిగణించి అభ్యసించాలనీ, ఇందులో ఎటువంటి అసభ్యతకు తావులేదన్నారు. తద్వారా లైంగిక సంక్రమణ వ్యాధులపై పూర్తి అవగాహన పెంపొంది వాటి బారిన పడకుండా జీవితాలను కాపాడుకోవచ్చని సూచించారు. అనుమానం ఉన్నవారు స్థానిక ఆరోగ్య కేంద్రాలలో ఉచిత హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకుని పూర్తి ఆత్మవిశ్వాసంతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ సాక్స్) తరఫున క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ శైలజ, డీఐసీ బుజ్జిబాబు హాజరయ్యారు. వారు మాటాడుతూ హెచ్‌ఐవీ నియంత్రణే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేసి అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా చేంజెస్ ఆధ్వర్యంలో విద్యాలయాలు, సచివాలయాల పరిధిలో యువతకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. దుర్గాభవాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరిబాబు, హెచ్‌ఓడీ శశి కిరణ్, చేంజెస్ సభ్యులతో పాటు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ చిత్రం తొలగింపు అప్రజాస్వామికం


పైలాన్‌పై జగన్ చిత్రాన్ని తొలగించడాన్ని ఖండిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కరప: గ్రామస్వరాజ్యం లక్ష్యంగా 2019లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ స్మారకంగా పైలాన్‌ను ఆవిష్కరించారు. ఆ పైలాన్ పైభాగంలో నవరత్నాల చక్రం లోగోలో జగన్, దివంగతనేత వైఎస్సార్ ముఖచిత్రాలు ఏర్పాటు చేశారు. వాటిని తొలగించేందుకు మండల జనసేన పార్టీ నాయకులు కుట్ర పూరితంగా పైలాన్‌పై లోగోను తొలగించి, నాలుగు సింహాల బొమ్మను ఏర్పాటు చేస్తున్నారు. ఈ చర్య అప్రజాస్వామికమని వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్‌లు తీవ్రంగా ఖండించారు. మాజీ సీఎం జగన్ చిత్రం తొలగింపు శీర్షికన మంగళవారం 'సాక్షి'లో వెలువడిన కథనానికి వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్‌లు స్పందించి కరపలో సమావేశమై జనసేన నాయకులు చేస్తున్న కుట్రపూరిత చర్యలను ఖండించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి పక్కనే ఉండే స్త్రీశక్తి భవన ఆవరణలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి 2019లో జనవరి 19న స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన డ్వాక్రా బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన మీటింగ్ హాలుకు చంద్రన్న సమావేశ మందిరంగా పేరుపెట్టారు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక విజ్ఞతతో ఆలోచించి, వాటి జోలికి వెళ్లలేదన్నారు. పార్టీలను పక్కనపెట్టి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి, అభివృద్ధే ధ్యేయంగా పనిచేశామన్నారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జేఎస్‌పీ నాయకులు కక్షపూరిత చర్యలకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జేఎస్‌పీ నాయకులు కూరాడ సచివాలయం భవనంపై ఉండే మాజీ సీఎం జగన్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు చిత్రాలను తొలగించారని, పెనుగుదురు గ్రామ సచివాలయంలో మీటింగ్ హాల్‌కు కన్నబాబు సమావేశ మందిరం అని పేరు పెడితే దానిని తొలగించారని, ఇప్పుడు కరపలో పైలాన్‌పై జగన్ చిత్రాన్ని తొలగించారన్నారు. ఇప్పటికైనా ఆ నాయకులు శిలా ఫలకాలు, ముఖచిత్రాలు కూలకొట్టడం మానుకోవాలన్నారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు వాసంశెట్టి రామారావు, నక్కా బాబులు, అనసూరి శ్రీనివాసరావు, చింతా బుజ్జి, పెంకే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

కరప: తలసేమియా బాధిత చిన్నారులను ఆదుకునేందుకు యంగ్‌మైండ్స్ సేవాసంస్థ తలపెట్టిన రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ–1 కె.బుల్లికృష్ణవేని కోరారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ, సీఆర్పీలతో కల్సి రక్తదాన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండలంలోని ఉపాధ్యాయులు, కార్యాలయం సిబ్బంది స్పందించి రక్తదానం చేయాలన్నారు. సంస్థ అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15న కాకినాడ గాంధీనగర్‌లోని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. సీఆర్పీలు పి.రాజు, పి.సత్యనారాయణ, లక్ష్మి, సుజాత, చంద్రకళ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలి

బోట్‌క్లబ్: పంచాయతీకి 13 ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించకపోవడం శోచనీయమని వాకలపూడి మాజీ సర్పంచ్ గింజాల శ్రీనివాసరావు అన్నారు. పంచాయతీ రాజ్ పాలన నుంచి ప్రభుత్వ గెజిట్ ద్వారా వేరైన కాకినాడ అర్బన్ ఏరియా పూర్వ పంచాయతీల విలీనంపై పంచాయతీ మాజీ సర్పంచ్‌లు సభ్యులు, ప్రజాప్రతినిధులు సమావేశమై చర్చా వేదిక నిర్వహించారు. జన్మభూమి పార్కు వద్ద బలగం ఎస్టేట్ మీటింగ్ హాలులో మంగళవారం ఉదయం శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ సామాజిక వేత్త దూసర్లపూడి రమణ రాజు పాల్గొన్నారు. 13 ఏళ్లుగా పంచాయితీ ఎన్నికలు లేకుండా కార్పొరేషన్ లో విలీనం పూర్తి కాకుండా నడి సంద్రంలో నావలాగా అర్బన్ ఏరియాల్లో పౌర సౌకర్యాలు లేవన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు కోల్పోయి 73, 74 రాజ్యాంగ సవరణ ఫలితాలు లేకుండా అన్ని విధాలుగా నానా అవస్థలు పడుతున్నారన్నారు. కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్‌ను కలిసి విలీనం విషయంలో సాంకేతిక అడ్డంకులు గురించి చర్చించాలని ప్రభుత్వ చర్యలను కోరాలని నిర్ణయించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావును కాకినాడలో విలీన గ్రామాల ఐక్య వేదిక బృందం కలిసి నివేదిక ఇవ్వాలని తీర్మానించారు. కాకినాడలో విలీన గ్రామాల ఐక్యవేదిక సమన్వయకర్త గా ఇంద్రపాలెం మాజీ సర్పంచ్ పలివెల వీరబాబుకు బాధ్యతలు స్వీకరించారు. సమావేశంలో అడ్డూరి ఫణీష్, బలగం ప్రసన్న కుమార్, పితాని అప్పన్న, సలాది శ్రీనివాసబాబు, మండా సింహాద్రిరావు, కముజు నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.